
కదిలిన విద్యుత్తు యంత్రాంగం


స్తంభాన్ని సరిచేస్తున్న సిబ్బంది

వందనం

పెంచికల్‌పేట్, న్యూస్‌టుడే: పెంచికల్‌పేట్ మండలంలోని గొంట్లపేట్ రహదారి పక్కన ఉన్న పంట చేనులో విద్యుత్తు తీగలు ప్రమాదకరంగా ఉన్నాయి. ఈనేపథ్యంలో ఈ నెల 23వ తేదీన 'ఈనాడు'లో 'ఒక వైపు ఒరిగి.. ప్రమాదకరంగా మారి' శీర్షికన కథనం ప్రచురితమైంది. సంబంధించిన అధికారులు స్పందించి బుధవారం తీగలను, స్తంభాన్ని సరి చేసినట్లు ఏఈ అజల్ కుమార్ తెలిపారు.


7 నుంచి చెకుముకి సంబరాలు

ఆసిఫాబాద్ అర్బన్, న్యూస్‌టుడే : రాష్ట్ర పాఠశాల విద్యాశాఖతో కలిసి జనవిజ్ఞాన వేదిక ఏటా నిర్వహించే చెకుముకి సంబరాలు జిల్లాలో నవంబరు 7వ తేదీన పాఠశాల స్థాయి నుంచి ప్రారంభం కానున్నాయని జన విజ్ఞాన వేదిక తెలంగాణ జిల్లా ప్రతినిధులు ప్రకటించారు. బుధవారం జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో ఇన్‌ఛార్జి విద్యాశాఖాధికారి ఎం. ఉదయ్ బాబుతో కలిసి సంబంధిత ప్రచార గోడప్రతులను విడుదల చేశారు. ఈ సంబరాల్లో భాగంగా విద్యార్థులకు సైన్సు సంబంధిత విషయాలపై చెకుముకి టాలెంట్ టెస్టును నిర్వహించనున్నట్లు ప్రకటించారు. నవంబరు 21న మండల స్థాయి, 28న జిల్లా స్థాయి, డిసెంబరు 14, 15, 16 తేదీల్లో రాష్ట్ర స్థాయిలో పరీక్షను నిర్వహించి ప్రతిభ కనబరిచిన వారికి పురస్కారాలు అందజేస్తామని వివరించారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్లూరి రాజేశ్, ప్రచార కన్వీనర్ లకావత్ శంకర్, కార్యదర్శి గోవింద్‌రావు, ప్రముఖులు శాంతికుమారి, సంజయ్, మారుతి, టి.రమేశ్, హేమంత్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

గృహ యోగం ఎప్పుడో...

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే

పేదలకు సొంతింటి కల నెరవేర్చేలా ప్రభుత్వం కసరత్తు ముమ్మరం చేసింది. ఇళ్ల కోసం ప్రజా పాలనలో ఇదివరకే దరఖాస్తులు స్వీకరించగా.. ఇటీవల లబ్ధిదారుల ఎంపికకు ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేసింది. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఆమోదం తెలపగానే.. కమిటీల పనులు మొదలయ్యే అవకాశం కనిపిస్తోంది. దీపావళి పండగ నాటికి ఇళ్లు మంజూరు చేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటనతో పేద కుటుంబాల్లో ఆశలు చిగురిస్తున్నాయి.


ఆసిఫాబాద్ మండలం ఎల్లారం మార్గంలో పునాదికే పరిమితమై ఇలా..

జిల్లాలో..

నిర్మాణాల కోసం ఎంపికైన మండలాలు	5
మంజూరైన ఇళ్లు	1223
కేటాయింపులు	రూ. 62.44 కోట్లు
పూర్తయినవి	26
నిర్మాణ దశల్లో ఉన్నవి	313
మొదలే పెట్టనివి	884
కోర్టు కేసులో ఉన్నవి	248
నిర్మాణ వ్యయం	రూ. 11.76 కోట్లు

కాగజ్‌నగర్ బల్దియాలో..

మంజూరైనవి	480
పూర్తయినవి	288
వివిధ దశల్లో	192

జిల్లాలో సొంతిల్లు లేని పేద కుటుంబాలు రెండు పడక గదుల ఇళ్ల కోసం ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్నారు. భారాస ప్రభుత్వం పలు మండలాల్లో ఇళ్ల నిర్మాణాలకు నిధులు మంజూరు చేసింది. వివిధ శాఖల ఇంజినీరింగ్ విభాగాలు వీటిని పర్యవేక్షించి నిర్మాణాలు మొదలు పెట్టినా.. ఒక్కటీ పూర్తి కాక అర్ధాంతరంగా నిలిచిపోయాయి. కాంగ్రెస్ ప్రభుత్వం సొంత స్థలం ఉంటే ఇంటి నిర్మాణం కోసం రూ.5 లక్షలు ఇస్తామని, స్థలం లేని వారికి ఇళ్లు మంజూరు చేస్తామని చెప్పింది. తాజాగా ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు చేయడం, అర్హత, విధి విధానాలు ప్రకటించడం, నియోజకవర్గానికి నాలుగు వేల చొప్పున ఇళ్లు ఇస్తామని చెప్పడం, కాగజ్‌నగర్‌లో నిర్మించిన ఇళ్లను ఇటీవల అధికారులు పరిశీలించడంతో ఆశలు రేకెత్తుతున్నాయి. ప్రజా పాలనలో ఇళ్ల కోసం 1.54 లక్షల మంది దరఖాస్తులు చేసుకున్నారు. వీటినే పరిశీలిస్తారా? లేదా మళ్లీ దరఖాస్తులు కోరతారా అనేది తెలియాల్సి ఉంది.

మండలాల్లో పూర్తయినవి.. 26

భారాస హయాంలో ఆసిఫాబాద్, జైనూర్, కెరమెరి, కాగజ్‌నగర్, వాంకిడి మండలాల్లో 1,223 ఇళ్లు మంజూరు చేశారు. వీటిలో 26 నిర్మాణాలు పూర్తి కాగా 313 వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం నియోజకవర్గానికి నాలుగు వేల ఇళ్ల చొప్పున విడతల వారీగా మంజూరు చేస్తామనడంతో.. జిల్లాలో సుమారు 7,500 వరకు వచ్చే అవకాశం ఉంది.

కాగజ్‌నగర్ బల్దియాలో..


కాగజ్‌నగర్‌లో నిర్మించిన ఇళ్లు

కాగజ్‌నగర్ బల్దియా పరిధిలోని బోరిగాంలో 19 ఎకరాల్లో ఇళ్ల నిర్మాణాలకు ఆర్అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో శ్రీకారం చుట్టారు. 480 ఇళ్లు మంజూరు కాగా.. 288 పూర్తి చేశారు. 192 వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయి. పూర్తయిన వాటిని పంపిణీ చేసేందుకు గతేడాది మార్చిలో అధికారులు దరఖాస్తులు స్వీకరించగా.. 5,317 మంది చేసుకున్నారు. లక్కీ డ్రా విధానం ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేశారు. విమర్శలు రావడం, ఆందోళనలు మొదలవడంతో ప్రక్రియ ఆగింది. కొందరు కోర్టును ఆశ్రయించడం, ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో.. పంపిణీకి అడ్డుకట్ట పడింది. మళ్లీ ఆ నిర్మాణాల వైపు ఎవరూ చూడకపోవడంతో సామగ్రి చోరీకి గురవుతోంది. కాంగ్రెస్ సర్కారు ఇళ్లు మంజూరు చేస్తామని చెబుతుండటం, అధికారులు వీటిని పరిశీలించడంతో కదలిక వచ్చింది.

డొక్కు బస్సులే దిక్కు!

● ఆర్టీసీలో సగం అద్దె వాహనాలే
● నిర్వహణ లేక తరచూ మొరాయింపు

ఈటీవీ - ఆదిలాబాద్

ఆదిలాబాద్ రీజియన్ ఆరు డిపోల పరిధిలో 620 బస్సులుంటే 311 అద్దెవి ఉన్నాయి. 309 సంస్థ బస్సులున్నాయి. ఆర్టీఏ నియమావళి ప్రకారం 15 ఏళ్లు దాటినా.. 13 లక్షల కిలోమీటర్ల వరకు తిరిగిన బస్సులను వినియోగించరాదనే నిబంధనలు ఆర్టీసీలో అమలు కావటం లేదు. రీజియన్ పరిధిలో 16 లక్షల కిలోమీటర్ల దాటిన 70 బస్సులను ఇంకా తిప్పుతూనే ఉన్నారంటే జిల్లాకు ఆ సంస్థ ఇస్తున్న ప్రాధాన్యం వెల్లడవుతోంది. ఇందులో నిర్ణీత గడువు ముగిసిన 30 నుంచి 40 బస్సులను స్క్రాప్‌కు పంపించాల్సి ఉన్నా సరిపడా కొత్త బస్సుల్లేక పాత వాటినే ఏదో రకంగా వినియోగించుకోవాల్సి వస్తోంది. అద్దె బస్సుల పరిస్థితిని చూసేవారేలేరు.


భైంసాలో మంగళవారం రాత్రి మహిళా కండక్టరు సెల్ ఫోన్ వెలుతురులో మరమ్మతులు చేస్తున్న డ్రైవర్, మెకానిక్

భైంసా డిపోలో 32 బస్సుల్లో 30 పాతవే

భైంసా: భైంసా డిపో పరిధిలోని బస్సులన్నీ పాతవే కావడంతో తరచూ మొరాయిస్తున్నాయి. డిపోలో సంస్థ బస్సులు 32 ఉండగా, వాటిలో 30 పాతవే. 47 అద్దె బస్సుల్లో కొన్నింటి పరిస్థితి అలాగే ఉంది. వాటి నిర్వహణ బాధ్యత సంబంధిత యాజమాన్యాలదే అయినా, వాటిని ప్రతిరోజు పరిశీలించి బస్టాండుకు పంపాల్సిన బాధ్యత డిపో అధికారులదే. తాజాగా ఎడ్‌బిడ్ సర్వీసు అద్దె బస్సు ఒకరోజు మూడు సార్లు మొరాయించింది. మంగళవారం రాత్రి సైతం భైంసా బస్టాండు దాటకుండానే సాంకేతిక కారణాలతో నిలిచిపోయింది. మెకానిక్‌లు వచ్చి మరమ్మతులు చేశారు. సాయంత్రం 6 వరకే విధులు నిర్వహించాల్సిన మహిళా కండక్టరు రాత్రి 9:30 గంటలకు ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చి ఇంటికి వెళ్లాల్సి వచ్చింది.

ఉమ్మడి జిల్లాలోని బస్సుల వివరాలు..

	ఆర్టీసీ	అద్దె
రాజధాని	08	--
లహరి(ఏసీ)	12	--
లహరి(నాన్‌ఏసీ)	14	--
సూపర్ లగ్జరీ	88	--
డీలక్స్	03	--
సెమీ డీలక్స్	04	--
ఎక్స్‌ప్రెస్	33	75
పల్లె వెలుగు	149	234

ఎక్కడపడితే అక్కడే ఆగిపోతూ..



ఆదిలాబాద్ బస్టాండు నుంచి బయలుదేరిన అయిదు నిమిషాలకే కొద్ది దూరంలోనే ఆర్టీసీ బస్సు ఆగిపోయింది. బస్సు నిండా ప్రయాణికులు ఉన్నారు. వారంతా తిరిగి కాలినడకన అవస్థలు పడుతూ బస్టాండ్‌కు మరో బస్సు కోసం వెళ్లారు. నిజామాబాద్‌కు వెళ్లాల్సిన ఆదిలాబాద్ డిపోకు చెందిన బస్సు మంగళవారం మరమ్మతులతో ఒక్కసారిగా ఆగిపోయింది. నిత్యం ఇలాగే జరుగుతున్నా పట్టింపు కరవైంది.

కొత్తవి రావడం లేదు

మంచిర్యాల డిపో పరిధిలో డొక్కు బస్సులు చాలానే ఉన్నాయి. ప్రయాణానికి అసలు పనికిరాని మూడు బస్సులను గుర్తించిన అధికారులు కరీంనగర్‌లోని సంస్థ స్క్రాప్ షెడ్డుకు పంపించాలని పక్కనపెట్టారు. వాటిస్థానంలో ఒకటే కొత్త బస్సును కేటాయించారు. ఈ దుస్థితి కేవలం మంచిర్యాల డిపోకే పరిమితం కాలేదు. ఆసిఫాబాద్, భైంసా డిపోల్లోనూ ఇలాగే ఉంది. కొత్తవాటిని కేటాయించడం లేదు.

అన్నింటిని పరిష్కరిస్తాం

- ప్రణీత్, డిప్యూటీ ఆర్ఎం



ఒక్కో సమస్యను పరిష్కరించే ప్రయత్నం జరుగుతోంది. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా కొత్త బస్సుల కోసం ఉన్నతాధికారులకు లేఖ రాశాం. రీజియన్ పరిధిలోని పుణ్యక్షేత్రాలు, పర్యాటక కేంద్రాలకు సర్వీసులు తిప్పేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తాం.

ఈఎస్ఐ మందులు పక్కదారి!

✦ విక్రయిస్తుండగా పట్టుకున్న అధికారులు
✦ ఆలస్యంగా వెలుగులోకి..



ఈనాడు, కరీంనగర్: ఈఎస్ఐ ఆస్పత్రిలో రోగులకు ఇవ్వాల్సిన మందులను అక్రమంగా కరీంనగర్‌లోని ఓ మెడికల్ దుకాణంలో విక్రయిస్తుండగా అధికారులు పట్టుకున్న సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కుమురం భీం జిల్లాలోని సిర్పూర్ కాగజ్‌నగర్‌లో ఉన్న ఈఎస్ఐ ఆస్పత్రి ఉద్యోగి ఈ అక్రమానికి పాల్పడ్డారు. ఆయన వాహనంలో రూ.4.87 లక్షల విలువైన అయిదు రకాల మందులను మూడు రోజుల కిందట కరీంనగర్‌కు తీసుకొచ్చారు. రహస్యంగా కరీంనగర్ ఉస్మాన్‌పురలో ఉన్న ఓ మెడికల్ దుకాణంలో విక్రయిస్తుండగా ఔషధ నియంత్రణాధికారులు పట్టుకున్నారు. కొనుగోలు చేస్తున్న వ్యాపారిపై కేసు నమోదు చేశారు. వాహనంతోపాటు దొడ్డిదారిన విక్రయిస్తున్న ఔషధాలను స్వాధీనం చేసుకుని న్యాయస్థానానికి అప్పగించారు. వీటిని విక్రయిస్తున్న ఉద్యోగిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఈఎస్ఐ సంయుక్త సంచాలకుడికి ఔషధ నియంత్రణ శాఖ డీజీ లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఉన్నతాధికారుల నుంచి వచ్చిన ఆదేశాలతో ఆయనపై చర్యలు ఉండే అవకాశముంది. ఇంత పెద్ద మొత్తంలో ఔషధాలు పట్టుపడిన తీరుని అధికారులు సవాలుగా తీసుకుంటున్నారు. గతంలోనూ ఇదే విధంగా పలుచోట్ల విక్రయించి ఉంటారనే అనుమానంతో ఈ సంఘటనపై మరింత లోతుగా విచారణ చేస్తున్నారు. పట్టుబడిన వ్యక్తుల నుంచి వాంగ్మూలాలు తీసుకోవడంతోపాటు వీరికి వచ్చిన సమాచారం ఆధారంగా పలు దుకాణాలపై కూడా నిఘా పెట్టినట్లు తెలుస్తోంది. కరీంనగర్ ఔషధ నియంత్రణశాఖ సహాయ సంచాలకులు ఎం.శ్రీనివాసులు నేతృత్వంలోని సిబ్బంది ఈ అక్రమ రవాణాపై కొన్ని రోజులుగా నిఘా పెట్టినట్లు తెలుస్తోంది. విశ్వసనీయ వ్యక్తులు ఇచ్చిన సమాచారంతో సిర్పూర్ కాగజ్‌నగర్ నుంచి కరీంనగర్ వరకు వాహనాన్ని రహస్యంగా అనుసరిస్తూ ఫార్మసిస్టు సహా కొనుగోలుదారును పట్టుకున్నారు. ఈ ఆపరేషన్‌లో కరీంనగర్, పెద్దపల్లి, మంచిర్యాల డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు కార్తిక్ భరద్వాజ్, శ్రవణ్, చందనతోపాటు సిబ్బంది పాల్గొన్నారు. ఈ కేసును ఔషధ నియంత్రణ శాఖ డీజీ కమలాసన్ రెడ్డి ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నారు.


మధ్యాహ్న భోజనం తీరును పరిశీలిస్తున్న అదనపు పాలనాధికారి దీపక్ తివారీ

విద్యార్థుల్లో కనీస సామర్థ్యాలు పెంపుపై దృష్టి

కెరమెరి, న్యూస్‌టుడే : విద్యార్థులలో కనీస సామర్థ్యాలు పెంపొందించేలా కృషి చేయాలని జిల్లా అదనపు పాలనాధికారి దీపక్ తివారీ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జడ్పీ పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. నాస్ పరీక్ష వివరాలను అడిగి తెలుసుకున్నారు. వెనుకబడిన విద్యార్థులపై దృష్టి సారించాలన్నారు. అనంతరం అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ద్వారా చేపడుతున్న మరుగుదొడ్లు, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సూచనలు చేశారు. మెను ప్రకారం భోజనాలు అందించాలన్నారు. అనంతరం హట్టి శివారులో కొనసాగుతున్న ఎల్ఆర్ఎస్ సర్వేను పరిశీలించారు. గడువులోపు పూర్తిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో అమ్జద్ పాషా, ఎంఈవో ఆడే ప్రకాష్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల కొవ్వొత్తుల ర్యాలీ

కాగజ్‌నగర్, న్యూస్‌టుడే : పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం రాత్రి పట్టణంలో పోలీసులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. పోలీస్ స్టేషన్ నుంచి ఎస్పీఎం గేటు మీదుగా లారీ చౌరస్తా, రాజీవ్‌గాంధీ చౌరస్తా వరకు ర్యాలీ చేపట్టారు. టౌన్ సీఐ శంకరయ్య, ఎస్సై దీకొండ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

పుర అభివృద్ధికి ప్రణాళిక రూపొందించండి

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : కాగజ్‌నగర్ పురపాలిక అభివృద్ధికి ప్రణాళిక రూపొందించాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారీ పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లతో కలిసి పాల్గొని మాట్లాడారు. కాగజ్‌నగర్ పురపాలిక అమృత్ 2.0 కింద ఎంపికైనందున చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు సంబంధించి రెవెన్యూ, విద్యుత్తు, రోడ్లు, నీటిపారుదల, ఆర్టీసీ, మెప్మా, వెటర్నరీ, వైద్య, ఆరోగ్య, మార్కెటింగ్, పర్యాటక, రవాణా, అటవీ, అగ్నిమాపక, మైనింగ్, పరిశ్రమల శాఖల అధికారులతో సమీక్షించారు. పురపాలికలో ప్రస్తుతం కొనసాగుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులతో పాటు వచ్చే 20 ఏళ్లకు సంబంధించి చేపట్టే అభివృద్ధి పనుల ప్రణాళిక తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. జీపీఎస్ డ్రోన్ సిస్టం ద్వారా మున్సిపాలిటీని చిత్రీకరిస్తారని చెప్పారు. గత పదేళ్ల పట్టణ వివరాలు, వచ్చే 20 ఏళ్ల నాటికి ప్రజలకు అవసరమైన వాటిని గుర్తించి ప్రణాళికలను శాఖల వారీగా ఈ నెల 31వ తేదీ వరకు పూర్తి చేసి పుర కమిషనర్‌కు అందించాలన్నారు. ఇందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

తరలింపుతో గతి తప్పిన ప్రగతి..

● ఉట్నూరు వీడుతున్న ముఖ్యశాఖలు
● అవస్థల్లో గిరిజనులు

ఏజెన్సీ ప్రాంతాలలో ప్రజా సంక్షేమం, అభివృద్ధి కోసం దశాబ్దాల కిందట ఏర్పాటు చేసిన ముఖ్యమైన ప్రభుత్వ శాఖలను క్రమంగా మైదాన ప్రాంతాలకు తరలించేశారు. ఇది ఏజెన్సీ గ్రామాల అభివృద్ధిపై తీవ్ర ప్రభావం చూపుతోంది. అభివృద్ధి కోసం మరిన్ని శాఖలను తీసుకురావాల్సిన పాలకులు ఉన్న వాటిని తొలగించడంతో ప్రగతి కుంటుపడుతోందని గిరిజనులు వాపోతున్నారు.

న్యూస్‌టుడే, ఉట్నూరు

ఉమ్మడి జిల్లాలోని ఆదివాసీ గిరిజనుల సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంతో ఉట్నూరులో సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ(ఐటీడీఏ) కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. ఆ తరువాత ఐటీడీఏ ఆధీనంలోని ఏజెన్సీ డివిజన్ పరిధిలోని ఉట్నూరు, ఇంద్రవెల్లి, నార్నూర్, గాదిగూడ, సిరికొండ, జైనూర్, సిర్పూరు(యు), లింగాపూర్ మండలాల అభివృద్ధి కోసం ప్రభుత్వం ఇక్కడి చిన్న నీటి పారుదలశాఖ, సహాయ వ్యవసాయ సంచాలకులు(ఏడీఏ), జిల్లా మలేరియా అధికారి(డీఎంవో), పట్టు పరిశ్రమ శాఖ సంచాలకులు(ఏడీ), రోడ్లు, భవనాల డివిజన్ కార్యాలయాలను ఏర్పాటు చేసింది. వీటి ద్వారా ఏజెన్సీ మండలాలలో అభివృద్ధి పనులు చేపట్టేవారు. సంక్షేమ పథకాలు అమలు చేసేవారు. ప్రస్తుతం ముఖ్యమైన ఆ శాఖలను ప్రభుత్వం మైదాన ప్రాంతాలకు తరలించింది.

చిన్ననీటి పారుదల శాఖ ఆదిలాబాద్‌కు

ఏజెన్సీ ప్రాంతంలో సాగునీటి పథకాలను వినియోగంలోకి తేవాలనే లక్ష్యంతో 1980లో ఐటీడీఏ కార్యాలయం ఉట్నూరులో చిన్ననీటి పారుదలశాఖ డివిజన్ కార్యాలయాన్ని ఏర్పాటు చేసింది. ఈ శాఖ ఆధ్వర్యంలో ఏజెన్సీ మండలాలలోని చెరువులకు మరమ్మతులు, కొత్త చెరువుల నిర్మాణం, కుంటల తవ్వకాలు చేపట్టి రైతులకు సాగునీటి సమస్యను తీర్చేవారు. 2016లో ప్రభుత్వం నీటి పారుదల శాఖలో చేపట్టిన మార్పులతో ఉట్నూరులోని చిన్న నీటి పారుదల శాఖను మైదాన ప్రాంతమైన ఆదిలాబాద్‌కు తరలించి, నీటి పారుదల శాఖలో కలిపేసింది.

అందని వ్యవ'సాయం'

ఏజెన్సీ ప్రాంతంలోని సుమారు 50 వేలకు పైచిలుకు రైతులకు సంబంధించి 1.50 లక్షల ఎకరాలలో పండించే పంటలు, వ్యవసాయ సాగులో వచ్చే సమస్యలను పరిష్కరించే లక్ష్యంతో ఉట్నూరులో ఏర్పాటు చేసిన సహాయ వ్యవసాయ సంచాలకుడి(ఏడీఏ) కార్యాలయాన్ని ప్రభుత్వం ఇచ్చోడకు తరలించింది. సహాయ వ్యవసాయ సంచాలకులు లేక రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు.

మలేరియా తగ్గేదెలా?

ఏజెన్సీ ప్రాంతంలో కాలంతోపాటు కీటక జనిత వ్యాధులు విజృంభిస్తుంటాయని గుర్తించిన ప్రభుత్వం 1980లో ఇక్కడ జిల్లా మలేరియాధికారి కార్యాలయాన్ని ఏర్పాటు చేసింది. మూడు దశాబ్దాల పాటు ఇక్కడ సేవలందించిన కార్యాలయాన్ని ప్రభుత్వం ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి తరలించింది. ఏజెన్సీలో మలేరియాధికారి లేక పర్యవేక్షణ కరవై మారుమూల గ్రామీణ ప్రాంతాలలో దోమలకాటుతో వచ్చే మలేరియా ఇతర వ్యాధులు పెరిగిపోయి ప్రజారోగ్యంపై ప్రభావం పడుతోంది.

మరిన్ని శాఖలు..

రహదారుల నిర్మాణం కోసం ఉట్నూరులో ఏర్పాటు చేసిన రోడ్లు, భవనాల శాఖ డివిజన్ కార్యాలయాన్ని చెన్నూరుకు తరలించారు. ఆదివాసీ గిరిజనులకు సత్వర న్యాయం కోసం గతంలో ఇక్కడ ఏర్పాటు చేసిన సంచార న్యాయస్థాన వ్యవస్థను మూసేశారు. ఐటీడీఏ ఉట్నూరులో మంజూరుచేసిన ప్రత్యేక ఏజెన్సీ విద్యాధికారి పోస్టు, పట్టు పరిశ్రమల శాఖ సంచాలకుడి(ఏడీ) పోస్టును రద్దు చేశారు.

అంచనాలతో సరా.. ఆదుకోరా?

● ఆందోళనలో పంట నష్టపోయిన అన్నదాతలు..

బెజ్జూరు, న్యూస్‌టుడే



కోటి ఆశలతో పంటల సాగు మొదలు పెట్టినా.. ఆదిలోనే భారీ వర్షాలు, ప్రాణహిత, పెద్దవాగు వరదలు ముంచేశాయి.. దిక్కుతోచని స్థితిలో మళ్లీ దుక్కులు దున్నుకుని సాగు చేయగా రెండోసారి సైతం పంటలు నీట మునిగి రైతులను కష్టాలపాల్జేశాయి. వీటి పరీవాహకంలో దాదాపు 1500 ఎకరాల్లో పంటలు నష్టపోయినట్లు వ్యవసాయ అధికారులు ప్రాథమిక అంచనాలు రూపొందించారు. కానీ క్షేత్రస్థాయిలో పంటలను సర్వే చేసి నివేదిక పంపకపోవడంతో పరిహారం మంజూరు లేదని బాధితులు వాపోతున్నారు.

ఏటా నష్టమే..

జిల్లాలోని బెజ్జూరు మండలంలోని ప్రాణహిత, పెద్దవాగు పరీవాహకంలోని తలాయి, తిక్కతల్లి, పాపన్‌పేట్, మొగవెల్లి, ఇప్పలగూడ, సోమిని, పాతసోమిని, గెర్రెగేడ, నాగేపల్లి, తదితర గ్రామాల రైతులు సాగు చేసిన పత్తి, ఇతర పంటలు ఏటా నష్టపోతున్నారు. ఈ ఏడాది రెండు సార్లు ప్రాణహిత, పెద్దవాగు వరదలు ముంచేయడంతో రూ.వేల పెట్టుబడులు నష్టపోయారు. మొదటిసారి కురిసిన వర్షాలు, వరదల కారణంగా ఎనిమిది రోజులపాటు పంటలు నీటిలోనే మునిగి మురిగిపోయాయి. ఆ తర్వాత మళ్లీ సాగు చేయగా రెండోసారి సైతం ముంచేయడంతో దిక్కుతోచని స్థితిలో పడ్డారు. 1500 ఎకరాలు నష్టపోయినట్లు అంచనాలు వేసి చేతులు దులుపుకొన్నారే తప్ప అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి సర్వేలు చేయలేదని అన్నదాతలు ఆరోపిస్తున్నారు. జిల్లాలోనే అత్యధికంగా బెజ్జూరు మండలంలో పంటలు నష్టపోయినా అధికారుల నిర్లక్ష్యం అన్నదాతలకు శాపంగా మారింది. ఈ విషయంలో బాధిత రైతులు ఆందోళన కార్యక్రమాలు చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు.


జులైలో కురిసిన వర్షాలకు నీటమునిగిన పంటలు

నష్టంపై నివేదికలు పంపాం

రామకృష్ణ, ఇన్‌ఛార్జి ఏఓ

ప్రాణహిత,పెద్దవాగు పరీవాహకంలో దెబ్బతిన్న పంటలపై నివేదికలు పంపించాం. 33 శాతం మించి దెబ్బతిన్న పంటలకు పరిహారం మంజూరైంది. ఆ లోపు దెబ్బతిన్న పంటలకు పరిహారం విడుదల కాలేదు. ఈ విషయంలో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

ఇప్పటికైనా మంజూరు చేయాలి


లంగారి శ్రీనివాస్, తలాయి



ప్రాణహిత, పెద్దవాగు వరదల తాకిడికి పంటలు తీవ్రంగా నష్టపోయాం. ఈ విషయంలో వ్యవసాయ, రెవెన్యూ అధికారులకు సమాచారమిచ్చాం. కేవలం ప్రాథమిక అంచనాలు పంపి చేతులు దులుపుకొన్నారు. క్షేత్రస్థాయిలో సర్వేలు చేపట్టలేదు. పక్క మండలాల్లో పంటలకు నష్టపరిహారం వచ్చింది. కానీ మేం వేల రూపాయలు నష్టపోయినా పరిహారం మంజూరు కాలేదు. ఇప్పటికైనా మంజూరు చేయకుంటే ఆందోళనలు చేపడతాం.

తొమ్మిది ఎకరాల్లో పంట నష్టం

జలపతి, రైతు, తలాయి



భారీ వర్షాలకు, ప్రాణహిత, పెద్దవాగు వరద పత్తి పంటను ముంచేసింది. తొమ్మిది ఎకరాల్లో పంట నష్టపోవడంతో రూ.లక్ష పెట్టుబడి కోల్పోయాను. అధికారులు స్పందించి నష్టపోయిన పంటలకు నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలి.

యువతుల స్ఫూర్తి.. చైతన్య దీప్తి

● పశువైద్యాధికారులుగా కొలువులు

ఆడపిల్ల గడప దాటకూడదు. అది గతం. ఆకాశమే హద్దు ఇది ప్రస్తుతం. రంగమేదైనా.. పోటీ ఎంతైనా.. అవకాశాలు అందిపుచ్చుకుంటూ అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. వ్యవసాయ కుటుంబాల నుంచి వచ్చిన వారే అయినా కష్టపడి చదివారు. అనుకున్న లక్ష్యాన్ని సాధించారు.. పశువైద్యులుగా ఎంపికయ్యారు. ఉమ్మడి జిల్లాలో 18 మంది పశువైద్యాధికారులుగా బాధ్యతలు తీసుకోగా, అందులో పది మంది మహిళలు ఉన్నారు. వారి విజయగాథపై ప్రత్యేక కథనం. -న్యూస్‌టుడే, ఆదిలాబాద్ వ్యవసాయం

మూగజీవాల బాధ కదిలించింది..

-లావణ్య, ఆదిలాబాద్



ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం కుచులాపూర్‌కు చెందిన లావణ్యది వ్యవసాయ కుటుంబం. చిన్నప్పటి నుంచి చదువులో చురుగ్గా ఉండే వారు. ఆరో తరగతిలో నవోదయకు ఎంపికయ్యారు. గతంలో వారికి డెయిరీ ఉండటంతో పశువులకు వచ్చే వ్యాధుల పట్ల కొంత అవగాహన ఉంది. అప్పట్లో వాటికి చికిత్స చేసేందుకు వచ్చే వైద్యులు, వారి సేవలను గమనించిన లావణ్య పశు వైద్యాధికారి కావాలని అనుకున్నారు. ఆ దిశగా చదువుకొని కళాశాలలో సీటు పొందారు. టీఎస్‌పీఎస్సీ పరీక్ష రాసి పశువైద్యాధికారిగా ఎంపికయ్యారు. "చిన్నపుడు గ్రామంలో వందల సంఖ్యలో మూగ జీవాలు ఉండేవి. వాటికి వచ్చే వ్యాధుల గురించి గ్రామస్థులకు అవగాహన లేక సకాలంలో చికిత్స చేయక కొన్ని చనిపోయేవి. వాటి బాధ నాలో ఆలోచన కలిగించింది. అందుకే పశువైద్యాధికారి కావాలని అనుకున్నాను. సాధించానంటున్నారు లావణ్య".

ఉన్నత స్థానానికి చేరుకోవాలని..

-అంజలి, కుమురం భీం



కుమురం భీం జిల్లా కౌటల మండలం ముత్యంపేట పశువైద్యశాలలో అంజలి పశువైద్యురాలిగా బాధ్యతలు తీసుకున్నారు. వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన ఈమె పదో తరగతి వరకు మంచిర్యాలలో చదివారు. ఇంటర్ ప్రైవేట్ పాఠశాలలో చదివారు. తర్వాత ఎంట్రెన్స్ రాయడంతో బీవీఎస్సీలో సీటు వచ్చి హైదరాబాద్‌లో ఆయిదేళ్ల పాటు చదివారు. తర్వాత పీజీ చేసేందుకు కేరళకు వెళ్లారు. టీఎస్‌పీఎస్సీ నోటిఫికేషన్ రావడంతో పీజీ మధ్యలో వదిలేసి సాధన చేసి మంచి మార్కులతో పాసై పశువైద్యురాలిగా ఎంపికయ్యారు. "ఉన్నత స్థానానికి చేరుకోవాలనే లక్ష్యంతో పట్టుదలతో చదవడంతోనే ఇది సాధ్యమైంది. మూగజీవాలంటే ఇష్టం. వాటికి సేవ చేయాలనే ఆశయంతో బీవీఎస్సీ కోర్సులో చేరాను. వాటికి వైద్యం అందించి కాపాడేందుకు ప్రయత్నిస్తానంటున్నారు అంజలి".

ఏడేళ్లు వేచి చూసి..

- ప్రియాంక, నిర్మల్



నిర్మల్ జిల్లా లక్ష్మణచాందకు చెందిన ప్రియాంక పదో తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివారు. ఎక్కువ మార్కులు రావడంతో ఇంటర్ విద్యను ఉచితంగా ఓ కళాశాల అందించడంతో పూర్తి చేశారు. గ్రామీణ ప్రాంతంలో పుట్టి పెరగడంతో వ్యవసాయం, పశువులపై అవగాహన ఉండేది. కష్టపడి బీవీఎస్సీ (బ్యాచిలర్ ఆఫ్ వెటర్నరీ సైన్స్) కోర్సులో చేరి పూర్తి చేశారు. ప్రభుత్వ పశువైద్యుల పోస్టులు భర్తీ చేయకపోవడంతో ఒప్పంద పద్ధతిలో నిర్మల్ జిల్లాలో ఏడేళ్ల పాటు పని చేశారు. తర్వాత టీఎస్‌పీఎస్సీ పరీక్ష రాసి పశువైద్యాధికారిగా ఎంపికయ్యారు. "మూగజీవాలపై ప్రేమతోనే ఈ వృత్తిని ఎంచుకున్నాను. బీవీఎస్సీ పూర్తి చేసుకున్న తర్వాత నోటిఫికేషన్ రాక ఏడేళ్ల పాటు మండలంలో పని చేశాను. పశువులకు వచ్చే వ్యాధులు, ప్రభుత్వ కార్యక్రమాలపై అవగాహన ఉంది. ఇష్టంగా చేస్తే.. ఏ వృత్తి అయినా.. కష్టమేమి అనిపించదంటున్నారు

సేవతోనే సంతృప్తి..

-సంధ్యారాణి, మంచిర్యాల



మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలానికి చెందిన సంధ్యారాణి వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చారు. పదో తరగతి వరకు కస్తూర్బా ప్రభుత్వ పాఠశాలలో చదివారు. తర్వాత ఇంటర్ పూర్తి చేసి ఎంట్రెన్స్ రాయడంతో బీవీఎస్సీలో సీటు వచ్చింది. ఆయిదేళ్ల కోర్సు పూర్తి చేసుకున్న ఏడాదికి టీఎస్‌పీఎస్సీ నోటిఫికేషన్ జారీ అయింది. పరీక్ష రాసి పాసై పశువైద్యాధికారిగా ఉద్యోగం వచ్చింది. "నోరు లేని మూగజీవాలకు సేవ చేయడంలోనే సంతృప్తి ఉంది. గ్రామీణ ప్రాంతాలకు వెళ్లి ఉద్యోగం చేయాల్సి ఉంటుంది. ఆడపిల్లలకు కష్టం అనుకుంటారు చాలా మంది చెప్పారు. అయినా గ్రామీణ ప్రాంతాల్లో పశువైద్యం అందించాలనే లక్ష్యంతో ఉద్యోగంలో చేరానంటున్నారు సంధ్యారాణి".

ఇన్‌స్పైర్‌లో మనోళ్ల జోరు!

● మంచిర్యాల రెండు, కుమురంభీం జిల్లాకు నాలుగో స్థానం

● ఉమ్మడి జిల్లాలో 3,533 రిజిస్ట్రేషన్లు

న్యూస్‌టుడే, ఆసిఫాబాద్ అర్బన్

ఇన్‌స్పైర్ మనక్ 2024-25 ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లలో మన విద్యార్థులు ఉత్సాహం కనబరిచారు. ఉమ్మడి జిల్లా నుంచి ఏకంగా 3,533 ప్రాజెక్టుల కోసం నామినేషన్లు నమోదయ్యాయి. 92.2 శాతంతో మంచిర్యాల రాష్ట్రంలో రెండో స్థానం, 88.1 శాతంతో కుమురం భీం జిల్లా నాలుగో స్థానంలో నిలిచింది. 2023-24లో నమోదైన ప్రాజెక్టుల్లో కుమురం భీం జిల్లా నుంచి 108 జిల్లా స్థాయి ప్రదర్శనకు ఎంపిక కాగా వచ్చే నెలలో ప్రదర్శించేందుకు సిద్ధమవుతున్నారు.



జూన్‌లో ఇన్‌స్పైర్ మనక్ జాతీయ పోటీల్లో పాల్గొన్న అక్షర పటేల్

ఈసారి ప్రదర్శనలకు ఎంపికైన ప్రాజెక్టులు

ఆదిలాబాద్ 63	నిర్మల్ : 128
కుమురంభీం 108	మంచిర్యాల 149

కేంద్ర ప్రభుత్వ శాస్త్ర, సాంకేతిక అభివృద్ధి మంత్రిత్వశాఖ ఏటా దేశ వ్యాప్తంగా నిర్వహించే ఇన్‌స్పైర్ (ఇన్నోవేషన్ ఇన్ సైన్స్ పర్స్యూట్ ఫర్ ఇన్‌స్పైర్డ్ రీసర్చ్), మనక్ (మిలియన్ మైండ్స్ అడ్వాంటింగ్ నేషనల్ ఆస్పిరేషన్ అండ్ నాలెడ్జ్) విద్యార్థుల్లో సృజనకు పదును పెడుతోంది. నిత్యం జీవితంలో ఎదురయ్యే సమస్యలకు వారు చూపించే పరిష్కారాల ప్రాజెక్టుల రిజిస్ట్రేషన్లను ఆన్‌లైన్‌లో ఆహ్వానిస్తోంది. జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఎంపికైన ప్రాజెక్టుల్లో అత్యుత్తమమైన వాటిని జాతీయ పోటీలకు ఎంపిక చేస్తుంది. జాతీయ స్థాయిలో ఎంపికైన వాటిని జపాన్‌లో జరిగే అంతర్జాతీయ సుకురా ప్రదర్శనలకు పంపుతారు.

ఎంపిక ఇలా..

జిల్లాలోని అన్ని యాజమాన్యాల ఉన్నత పాఠశాలల్లో చదివే 6-10 తరగతుల విద్యార్థులు అర్హులు కాగా.. ప్రతి పాఠశాల నుంచి 5 ప్రాజెక్టులను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి. ఇందులో నుంచి 10శాతం ఉత్తమ ప్రాజెక్టులుగా ఎంపిక చేస్తారు. ఎంపికైన విద్యార్థుల బ్యాంకు ఖాతాలో ప్రాజెక్టు తయారీ ఖర్చుల కోసం రూ.10వేల చొప్పున జమచేస్తారు. గైడ్ టీచర్ సహాయంతో విద్యార్థులు దీన్ని సిద్ధం చేసి జిల్లా స్థాయి పోటీల్లో ప్రదర్శించాలి. జిల్లా స్థాయి ప్రదర్శనల్లో 11 ఉత్తమమైన వాటిని ఎంపిక చేసి రాష్ట్ర స్థాయికి పంపించనున్నారు.

ఇదీ ప్రయోజనం

జాతీయ స్థాయిలో జ్యూరీని ఆకట్టుకొని ఎంపికయ్యే అత్యుత్తమ 60 ప్రాజెక్టుల విద్యార్థులకు రాష్ట్రపతి స్థాయిలో గుర్తింపు లభిస్తుంది. ఈ విద్యార్థులకు రాష్ట్రపతి భవన్‌లో విందు ఏర్పాటు చేస్తారు. వీరి ప్రాజెక్టులకు పేటెంట్ హక్కును కల్పిస్తారు. వీరికి దేశంలో పేరున్న ఐఐటీల్లో ప్రవేశాలకు రిజర్వేషన్ కల్పిస్తారు.

జాతీయ స్థాయిలో మెరిసిన విద్యార్థులు

గతేడాది నవోదయ విద్యాలయానికి చెందిన 9వ తరగతి విద్యార్థిని ముకుం అక్షర పటేల్ జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంది. వరిగడ్డి కాల్చి వాయు కాలుష్యానికి కారణం కాకుండా ఆ గడ్డితో మొక్కలు పెంచే కుండీల తయారీకి వినియోగించవచ్చని నిరూపించే ప్రాజెక్టుతో ఆకట్టుకుంది.

ఉమ్మడి జిల్లాలో నమోదైన ఇన్‌స్పైర్ నామినేషన్లు

జిల్లా	మంచిర్యాల	కుమురం భీం	నిర్మల్	ఆదిలాబాద్
నామినేషన్లు	1308	768	894	563
శాతం	92.2	88.1	71.6	37.3

● జిల్లా ● నామినేషన్లు ● శాతం

వచ్చే నెలలో ప్రదర్శనలు

కటుకం మధుకర్, జిల్లా సైన్సు అధికారి, కుమురంభీం

ఈ సారి జిల్లా నుంచి 768 ప్రాజెక్టులు నమోదవడం సంతోషకరం. వచ్చే నెల మూడో వారంలో జిల్లా స్థాయి ప్రదర్శన పోటీలు ఉంటాయి. ప్రధానోపాధ్యాయులు, గైడ్ టీచర్లు ఈ విషయంలో తగు శ్రద్ధ తీసుకోవాలి.

నేడు ఏనుగు పండగ

● మహారాష్ట్ర సరిహద్దులో కొనసాగుతున్న సంప్రదాయం

న్యూస్‌టుడే, బేల :

దీపావళికి ముందు వచ్చే అష్టమి రోజు ఆదిలాబాద్ జిల్లావాసులు ఏనుగును పూజిస్తారు. గజేంద్రుడ్ని దైవంగా భావించి తరాలుగా పూజిస్తున్నారు. మహారాష్ట్ర సరిహద్దులో ఉండే బేల, జైనథ్, తాంసి మండలాల్లో ఈ ఆచారం కనిపిస్తుంది. ఆయా మండలాల్లోని మరాఠీ భాష మాట్లాడే ప్రజలు ఈ సంప్రదాయాన్ని తరాలుగా కొనసాగిస్తున్నారు. బహుళ అష్టమి నాడు ఏనుగు వ్రతం నిర్వహిస్తారు. మట్టితో ఏనుగు ప్రతిమలు తయారు చేస్తారు. గురువారం ఈ పండగను నిర్వహించనున్నారు.



మట్టితో తయారు చేసిన ఏనుగు విగ్రహం

ఎందుకు పూజిస్తారు..

ఈ పండగ వెనుక ఓ పౌరాణిక గాథ ఉందంటారు. ఒకసారి పార్వతీదేవి శివుడిపై అలిగి కైలాసం వదిలి వెళ్లిపోయిందట. కొన్ని రోజుల తర్వాత శివుడు ఏనుగు(గజేంద్రుడు)ను పంపి పార్వతీ దేవిని రమ్మని అన్నాడట. అప్పుడు పార్వతీ దేవి సంతోషంతో గజేంద్రుడిపై కూర్చొని తిరిగి శివుడి దగ్గరకు కైలాసానికి వచ్చిందట. ఈ అష్టమి నాడు ఏనుగును పూజిస్తే పార్వతీదేవి అనుగ్రహం లభిస్తుందని భక్తుల విశ్వాసం. ఐశ్వర్యాలు, సంపూర్ణ ఆరోగ్యం కలుగుతాయని భావిస్తారు. నియమ నిష్ఠలతో ఏనుగును పూజిస్తారు.

తాళసప్తమి వేడుకలు ప్రారంభం



సప్తమి వేడుకల్లో భజన చేస్తున్న భజనకారులు

కుభీరు: మండలంలోని పార్డి(కె) గ్రామ హనుమాన్ ఆలయంలో వారం రోజుల పాటు నిర్వహించే తాళసప్తమి వేడుకలు బుధవారం ప్రారంభమయ్యాయి. అర్చకులు ఆలయంలోని హనుమంతుడి ప్రతిమకు అభిషేకం, ప్రత్యేకపూజలు చేశారు. భజనకారుల భజనల మధ్య సప్తమి వేడుకలు ప్రారంభించారు. గ్రామస్థులు వంతుల వారీగా సప్తమి వేడుకల్లో పాల్గొంటారు. ప్రతిరోజు రాత్రి ప్రముఖ మహారాజ్‌ల కీర్తన, రాత్రికి అన్నదానం, హరిపాఠ్ పారాయణం, కాగడా హారతి నిర్వహిస్తారు. ఈనెల 30న ముగింపు వేడుకలు గ్రామంలో శోభాయాత్ర, ఉట్టిపగులగొట్టే కార్యక్రమం, మహాప్రసాదం ఉంటుందని ఆలయకమిటీ అధ్యక్షుడు బండెల శంకర్ తెలిపారు. మాజీ సర్పంచి ఆకుల గంగాధర్, ఆలయకమిటీ ప్రతినిధులు గంటా రాములు, లంక పోశెట్టి, మరాఠి బాబు, ఆకుల వెంకటి, గోజల గజ్జారాం, లంక సురేశ్, భజనకారులు పాల్గొన్నారు.

ఆలోచన అదిరే.. చిత్రాలతో మెరిపించే

● అధునాతన యంత్ర సహకారం.. అబ్బురపర్చే పనితనం

నిర్మల్ అర్బన్, న్యూస్‌టుడే:

చేసే పనిలో నిబద్ధత.. కొత్తదనం కోసం ప్రయత్నిస్తే మంచి ఫలితాలు వస్తాయి. అలా వినూత్న పంథాలో వెళ్లి సరికొత్త రూపంలో చిత్రాలు వేస్తూ అబ్బురపరుస్తున్నారు నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన పోతుల శ్రీనివాస్. ఎంబ్రాయిడరీలో రంగురంగుల దారాలతో ఆధునిక యంత్రంపై వీటిని తీర్చిదిద్దుతున్నారు. ఒక్కో చిత్రానికి గంటల సమయం పడుతున్నా తనలోని కళాత్మక ధోరణితో వాటిని తయారు చేస్తున్నారు. ఇప్పటికే పలువురు ప్రముఖుల చిత్రాలు రూపొందించి వాటిని వారికి అందజేసి ప్రశంసలు సైతం అందుకున్నారు.

ఉపాధి నిమిత్తం

ఖమ్మం జిల్లా వైరాకు చెందిన పోతుల శ్రీనివాస్ టైలరింగ్ వృత్తిలో ఉపాధి నిమిత్తం 20 ఏళ్ల క్రితం నిర్మల్ పట్టణానికి వచ్చారు. భార్య అనిత ఈయనకు తోడ్పాటుగా నిలిచారు. కాలానికి అనుగుణంగా తమ వృత్తిలోనూ మార్పులు అందిపుచ్చుకుంటూ ఎంబ్రాయిడరీ చేసే చిన్న యంత్రాన్ని కొనుగోలు చేశారు. దానిపై జాకెట్లకు వివిధ ఆకృతుల్లో ఎంబ్రాయిడరీ చేసేవారు. రెండేళ్ల క్రితం సరికొత్తగా వచ్చిన మరో మిషన్ కొన్నారు. దానిపై ఎంబ్రాయిడరీతోపాటు చిత్రాలు వేయొచ్చు. ఆ పనిపై అవగాహన, శిక్షణ పొంది ఏడాది క్రితం ఫొటోలు వేయడం ప్రారంభించారు.

ఒక్కో చిత్రానికి 16-18 గంటలు

నాణ్యమైన పట్టు వస్త్రాలపై చిత్రాలను వేస్తున్నారు. ఒక్కటి తయారు కావాలంటే సుమారు 16-18 గంటల సమయం పడుతుంది. ఇందుకు ఎంతో శ్రమిస్తున్నారు. ఏ మాత్రం అశ్రద్ధగా ఉన్నా శ్రమ వృథా అయ్యే ప్రమాదం ఉంటుందని శ్రీనివాస్ చెబుతున్నారు. అందుకే దగ్గరుండి మరీ పర్యవేక్షిస్తూ వాటిని తయారు చేస్తున్నారు. భార్యతోపాటు కుమారులు డిగ్రీ పూర్తి చేసిన కార్తిక్, మాధ్యమిక విద్యనభ్యసిస్తున్న అఖిల్ సాయం చేస్తున్నారు. ఏడాది కాలంలో ఇప్పటి వరకు సుమారు 105 చిత్రాలు వేశారు.




యంత్రం వేస్తున్న చిత్రాన్ని దగ్గరుండి పర్యవేక్షిస్తున్న శ్రీనివాస్

ప్రముఖుల ప్రశంసలు..

సీఎం రేవంత్‌రెడ్డి, ఏపీ, తెలంగాణ ఉపముఖ్యమంత్రులు భట్టి విక్రమార్క, పవన్‌కల్యాణ్, మంత్రి సీతక్క, మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, నిర్మల్ డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్, తిరుపతి ఎమ్మెల్యే శ్రీనివాస్ ఇలా ఎందరివో చిత్రాలు వేశారు. ఆయనలోని కళను గుర్తించి ఇప్పటికే ప్రముఖుల నుంచి ప్రశంసలు అందుకున్నారు. నాణ్యమైన సిల్క్‌పై చిత్రం వేయడంతో శాశ్వతంగా ఉంటాయని శ్రీనివాస్ చెబుతున్నారు. త్వరలో ప్రదర్శన ఏర్పాటు చేసే ఆలోచన ఉందని పేర్కొన్నారు. ఒక చిత్రం వేసే సమయంలో అనేక జాకెట్లకు ఎంబ్రాయిడరీ చేసి డబ్బు సంపాదించవచ్చని, కానీ ఈ కళపై ఆసక్తితో పలు గంటలు శ్రమిస్తున్నానని, తన పనికి లభిస్తున్న ప్రశంసలే తనకు ఇంధనమవుతోందని చెప్పారు.



సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటం



తల్లితో ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చిత్రపటం

పాఠశాలలకు పాలు సరఫరా చేయాలి: పీవో



లవణ మిశ్రమ ప్యాకెట్‌ను పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా

నిర్మల్, న్యూస్‌టుడే: ఐటీడీఏ నిర్వహిస్తున్న పాఠశాలలకు పాలు సరఫరా చేయాలని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా డెయిరీ నిర్వాహకులను కోరారు. బుధవారం నిర్మల్‌లోని విజయ పాల కేంద్రాన్ని సందర్శించారు. సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ సహకారంతో తెలంగాణలోని సహకార రంగంలో పర్యావరణహితంగా ఏర్పాటుచేసిన లవణ కర్మాగారం, పాల ప్యాకింగ్ యూనిట్లను పరిశీలించారు. గిరి విజయమిన్ ప్లాంటు నిర్వహిస్తున్న బృంద సభ్యులు చందు, మానసలను లవణ మిశ్రమ తయారీ, అమ్మకాలను అడిగి తెలుసుకున్నారు. విజయ పాల ప్యాకింగ్ ప్లాంటును సందర్శించి ఐటీడీఏ ద్వారా నలుగురు గిరిజన యువతకు నియామక పత్రాలు అందజేసి ఉపాధి కల్పించారు. రోజూ వారీ పాల సేకరణ, ప్యాకింగ్ సమాచారం, రైతులకు అందజేస్తున్న దాణా, లవణ మిశ్రమం, గడ్డి విత్తనాలను పరిశీలించారు. త్వరలో కాగజ్‌నగర్‌లో బల్క్ కూలింగ్ యూనిట్ ప్రారంభిస్తున్నామని చెప్పారు. అనంతరం జీసీసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సోఫీనగర్‌లోని పెట్రోల్ బంక్‌ను సందర్శించారు. జేడీఎం నాగభూషణం, పశు సంవర్ధక శాఖ జిల్లా అధికారి డాక్టర్ బాలిక్ అహ్మద్, జీసీసీ డీఎం రామానందం, విజయ డెయిరీ డీడీ మధుసూదన్, మేనేజర్ దస్రునాయక్, గజ్జారాం, సంతోష్, కాంతారావ్, పంపిణీదారులు రమణారెడ్డి, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి నాయకురాళ్లు!

● బోథ్ గురుకులంలో నైపుణ్యాల పెంపునకు ప్రత్యేక తర్ఫీదు

న్యూస్‌టుడే, బోథ్ :

విద్యార్థినులు నాయకురాళ్లుగా మారుతున్నారు. ఇదేమిటని ఆలోచిస్తున్నారా? అక్షరాల నిజం. సాధారణంగా గురుకుల విద్యార్థులు చదువులో, ఆటల్లో రాణించడం చూస్తుంటాం. విద్యతో పాటు విభిన్న రంగాల్లో రాణించేలా నైపుణ్యాలు పెంపొందిస్తూ విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి బాటలు వేస్తున్నారు ఆ పాఠశాల ఉపాధ్యాయులు.

బోథ్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో వినూత్న విధానాలను పాటిస్తూ భావిభారత పౌరుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తున్నారు. విద్యార్థి దశలోనే వారిలో నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తున్నారు. ఈ గురుకులంలో 634 మంది విద్యనభ్యసిస్తున్నారు. చాలా మంది గ్రామీణ ప్రాంత నిరుపేదలే. వారిలో నాయకత్వ లక్షణాలను గుర్తించారు పాఠశాల ఉపాధ్యాయులు. గురుకులంలో చురుగ్గా ఉన్న విద్యార్థినులలో నాయకత్వ లక్షణాలను గుర్తించి వారిని ఓ కమిటీగా ఏర్పాటు చేశారు. కమిటీ సభ్యులు పాఠశాలలోని భోజన సదుపాయాలను, విద్యార్థినుల సమస్యలను, కిచెన్‌గార్డెన్, పాఠశాల స్వచ్ఛతలను పర్యవేక్షిస్తారు. వీటితో పాటు ఉదయం సమయంలో విద్యార్థుల్లో భయం పోగొట్టేందుకు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ప్రతి రోజు ఓ రెండు నిమిషాలు విద్యార్థిని ఓ విషయంపై భయం లేకుండా అనర్గళంగా మాట్లాడేలా శిక్షణ అందిస్తున్నారు. పాఠశాలలోని విద్యార్థి నాయకులు ఇతర పిల్లలు చదువు, వైద్యం, సమయపాలన, వ్యక్తిగత శుభ్రత, ఆటపాటల్లో రాణించేలా శిక్షణనిస్తున్నారు. ఉపాధ్యాయులు తరగతి గదికి గైర్హాజరైన సమయంలో విద్యార్థి నాయకులు ఆ సమయాన్ని ఉపయోగించుకుంటున్నారు. ఉపాధ్యాయులుగా మారి తరగతి గదిలో తోటి విద్యార్థులు పలు విషయాలపై అవగాహన కల్పిస్తున్నారు. గురుకులంలో ఈ ప్రత్యేక కార్యాచరణ విద్యార్థినుల్లో మార్పు తీసుకొచ్చిందని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు.



బోథ్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో తోటి విద్యార్థులతో మాట్లాడుతున్న బృంద నాయకురాలు

చదువుతో పాటు నాయకత్వం

- హాసిని



మా గురుకులంలో తోటి విద్యార్థినుల సమస్యల పరిష్కారానికి బృంద నాయకురాలిగా కృషి చేస్తున్నాను. నేను చదువుకుంటూనే ఉదయం, సాయంత్రం వేళల్లో మిగతా విద్యార్థులకు సహాయం చేస్తున్నాను. విద్యార్థినులతో కలిసి పోయి ఉపాధ్యాయులకు, విద్యార్థినులకు వారధిగా నిలుస్తున్నాను. వెనుకబడిన పాఠ్యాంశాల్లో మెరుగైన మార్కులు సాధించేలా కృషి చేస్తున్నాను. విద్యార్థినులు అనారోగ్యం బారిన పడితే వైద్య సిబ్బంది దగ్గరికి తీసుకువెళతాను.

ఆటలు, సాంస్కృతిక పోటీల్లో రాణించేలా

- జి.రుతుమన్న



గురుకులంలో ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో ఆసక్తి గల విద్యార్థినులను గుర్తించి ఉపాధ్యాయుల సహకారంతో ప్రత్యేక శిక్షణ ఇప్పిస్తున్నాం. సెలవు దినాలలో విద్యార్థినులకు నృత్యాలు నేర్పిస్తున్నాం. పలు ప్రత్యేక కార్యక్రమాల్లో విద్యార్థినులు చదువుతో పాటు సాంస్కృతిక కార్యక్రమాల్లో రాణిస్తున్నారు. చదువులో సైతం వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని, వారి అనుమానాలను నివృత్తి చేస్తున్నా.

సమష్టి కృషితో ముందుకు..

- సంగీత, ప్రిన్సిపల్, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, బోథ్

పాఠశాలలో సమష్టి కృషితో ముందుకు వెళుతున్నాం. విద్యార్థినులను ఆదర్శ నాయకులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నాం. నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకు కమిటీని ఏర్పాటు చేసి వారికి పలు బాధ్యతలను అప్పగించాం. టీం లీడర్లు పాఠశాలలోని బాలికలను సమన్వయం చేస్తూ ముందుకు సాగుతున్నారు. పాఠశాలలోని సమస్యలను సైతం మా దృష్టికి తీసుకొస్తుండటంతో పరిష్కారానికి కృషి చేస్తున్నాం. ఈ విధానం సత్ఫలితాలనిస్తోంది.

28న జిల్లాకు బీసీ కమిషన్ బృందం రాక

పాలనాప్రాంగణం, న్యూస్‌టుడే : ఈ నెల 28న బీసీ కమిషన్ బృందం ఆదిలాబాద్ జిల్లాకు రానుందని కలెక్టర్ రాజర్షిషా తెలిపారు. జడ్పీ సమావేశ మందిరంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 వరకు కమిషన్ ఛైర్మన్ నిరంజన్ నేతృత్వంలో ప్రజాభిప్రాయ సేకరణ చేపడతారని పేర్కొన్నారు. ఆదిలాబాద్‌తో పాటు నిర్మల్, మంచిర్యాల, కుమురంభీం జిల్లాల కుల సంఘాల ప్రతినిధులు హాజరుకావాలని కోరారు. రాతపూర్వకంగా అభ్యర్థనలు నిర్ణీత నమూనాలో తగు సమాచారంతో సమర్పించవచ్చని పేర్కొన్నారు. కమిషన్ సభ్యులు బుధవారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించగా.. పాలనాధికారితో పాటు అదనపు పాలనాధికారి శ్యామలదేవి, బీసీ సంక్షేమాధికారి రాజలింగు పాల్గొన్నారు.

వైద్యుల నియామకానికి 29న ముఖాముఖి

ఆదిలాబాద్ వైద్య విభాగం: ఆదిలాబాద్ రాజీవ్ గాంధీ వైద్య విజ్ఞాన సంస్థ(రిమ్స్)లోని వివిధ విభాగాల్లో ఒప్పంద ప్రాతిపదికన ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ట్యూటర్లు, సీఎంఓ/సీఏఎస్ పోస్టులను భర్తీ చేయడానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రిమ్స్ సంచాలకుడు డాక్టర్ రాఠోడ్ జైసింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు తమ నిజ ధ్రువపత్రాలతో పాటు రెండు సెట్ల జిరాక్స్ ప్రతులతో వాక్ ఇన్ ఇంటర్వ్యూలకు హాజరు కావాలన్నారు. నియామకాలను మెరిట్, ఆర్‌ఓఆర్ నిబంధనల మేరకు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. వాక్ ఇన్ ఇంటర్వ్యూలు ఈ నెల 29న ఉదయం 10.30 నుంచి సాయంత్రం 4 వరకు కొనసాగుతాయన్నారు. ఆయా విభాగాల్లో భర్తీ చేయనున్న వైద్యుల వివరాల కోసం adilabad.telangana.gov.in లేదా rimsadilabad.org వెబ్‌సైట్లను సందర్శించాలని సూచించారు. వివరాల కోసం 98480 57606 నెంబరును సంప్రదించాలన్నారు.

కాగజ్‌నగర్(గ్రామీణం, న్యూస్‌టుడే:

? మండలంలోని రాస్పెల్లి పంచాయతీ బారెవాడలో మురుగు కాలువలు లేక వృథా నీరు రోడ్లపై ప్రవహిస్తోంది. ఇబ్బందులు పడుతున్నాం. -పెర్క జనార్దన్, స్థానికుడు

✔ మండలంలోని పంచాయతీల్లో మురుగు కాలువల నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపించాం. -రమేష్, ఎంపీడీఓ కాగజ్‌నగర్

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే:

? జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ నుంచి ఎల్లారం వెళ్లే మార్గంలో వీధి దీపాలు నిరంతరం వెలుగుతున్నాయి. దీంతో బల్బులు తరచూ కాలిపోవడంతోపాటు విద్యుత్తు దుబారా అవుతోంది. ఆన్ ఆఫ్ స్విచ్చులు ఏర్పాటు చేయాలి. - రాజేష్, జన్కాపూర్

✔ పరిశీలించి పరిష్కరించేలా చూస్తాం. - భుజంగ్‌రావు, పుర కమిషనర్

దేశీదారు పట్టివేత

కాగజ్‌నగర్, న్యూస్‌టుడే : మహారాష్ట్ర నుంచి కాగజ్‌నగర్‌కు బుధవారం ద్విచక్ర వాహనంలో తరలిస్తున్న దేశీదారు సీసాలను పట్టుకున్నట్లు ఎక్సైజ్ సీఐ వి.రవి తెలిపారు. కాగజ్‌నగర్‌కు చెందిన రతన్‌లాల్ మహారాష్ట్రలోని వీరూర్ గ్రామం నుంచి కాగజ్‌నగర్‌కు 200 దేశీదారుల సీసాలను తరలిస్తుండగా కాగజ్‌నగర్ రైల్వేస్టేషన్ సమీపంలో ఆబ్కారీ పోలీసులు పట్టుకున్నారని తెలిపారు. వాటి విలువ సుమారు రూ.8 వేలు ఉంటుందని, ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు. దాడుల్లో ఆబ్కారీ ఎస్సై రాజేశ్వర్, కానిస్టేబుల్స్ మల్లేష్, కృష్ణ, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

చింతలమానెపల్లి: మండలంలోని గూడెం గ్రామ సమీపంలోని చెక్‌పోస్ట్ వద్ద బుధవారం మహారాష్ట్రకు చెందిన దేశీదారు సీసాలను పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై ఇస్లావత్ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. గూడెం సమీపంలోని అంతరాష్ట్ర చెక్‌పోస్ట్ వద్ద ఎస్పీ ఆదేశాల మేరకు వాహనాల తనిఖీ చేపట్టామన్నారు. గూడెం గ్రామానికి చెందిన బొమ్మ సాయికృష్ణ అనే వ్యక్తి రూ.7,380 విలువైన 82 దేశీదారు సీసాలను తరలిస్తుండటంతో పట్టుకొని అతనిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఏఎస్సై యాదవ్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

పశువులు తరలిస్తున్న ఒకరిపై కేసు

వాంకిడి, న్యూస్‌టుడే: మండలం నుంచి కెరమెరికి అక్రమంగా పశువులను తరలిస్తున్న బొలెరో వాహనాన్ని బుధవారం రాత్రి పట్టుకున్నట్లు ఎస్సై ప్రశాంత్ తెలిపారు. ఇందాని ఎక్స్ రోడ్డు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా పశువులను తరలిస్తున్న వాహనం పట్టుకున్నామన్నారు. పశువులకు సంబంధించిన ఎలాంటి ఆధారాలు, అనుమతి పత్రాలు లేక పోవడంతో స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. వాహనాన్ని సీజ్ చేసి మూడు పశువులను కాగజ్‌నగర్ గోశాలకు తరలించినట్లు తెలిపారు. తరలిస్తున్న కెరమెరి మండలానికి చెందిన షేక్ తాజొద్దీన్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

భూ ఆక్రమణపై నోటీసులు జారీ

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : జిల్లా కేంద్రంలోని పాత చెక్‌పోస్టు ముందు భాగంలో బీజేపీ ప్రభుత్వ భూమి ఆక్రమించి నిర్మాణాలు చేపట్టిన నాలాను ఆక్రమించిన వారికి నోటీసులు జారీ చేసినట్లు తహసీల్దార్ రోహిత్ తెలిపారు. ఆక్రమణలకు పాల్పడ్డ ఐదుగురికి నోటీసులు అందించామన్నారు. ఎవరైనా ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు.

కంటి శస్త్రచికిత్సలకు తరలింపు

కాగజ్‌నగర్: కొత్తపల్లి వెంకటలక్ష్మి-చంద్రయ్య మెమోరియల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం 11 మందిని కంటి శస్త్రచికిత్సల కోసం తరలించారు. మంగళవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరంలో ఆపరేషన్లు అవసరమని గుర్తించిన వారిని ఉచిత రవాణా, భోజన సదుపాయం కల్పించి బెల్లంపల్లి లయన్స్ కంటి ఆసుపత్రిలో ఉచితంగా చికిత్సలు చేయించనున్నట్లు సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు డా.కొత్తపల్లి శ్రీనివాస్ తెలిపారు.

ఖాదీ మేళాను సద్వినియోగం చేసుకోవాలి

గోలేటి టౌన్‌షిప్, న్యూస్‌టుడే: బెల్లంపల్లి ఏరియా గోలేటిలోని సీఈఆర్ క్లబ్‌లో వావిలాల ఖాదీ గ్రామోద్యోగ్ ప్రతిష్ఠాన్ ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన ఖాదీ మేళాను జీఎం ఎం.శ్రీనివాస్ ప్రారంభించారు. ముందుగా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మేళాలో ప్రదర్శించిన వస్త్రాలను పరిశీలించి కొనుగోలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఖాదీ వస్త్రాలు కొనుగోలుపై 25 నుంచి 40 శాతం వరకు తక్కువ ధరలకు అందిస్తున్నారు. మారుమూల గ్రామానికి వచ్చి ఖాదీ వస్త్రాలు విక్రయించడం అభినందనీయమన్నారు. రోజు ఉదయం 9 నుంచి రాత్రి 9 గంటల వరకు తెరిచి ఉంచుతారని చెప్పారు. ఈ నెల 29వ తేదీ వరకు కొనసాగుతుందని, ఆసక్తిగల వారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రూ.20 వేల వరకు వస్త్రాలను క్రెడిట్‌పై అందిస్తామని, ఆయిదు వాయిదాలలో చెల్లింపు అవకాశం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. బెల్లంపల్లి ఏరియా ఎస్‌ఓటు జీఎం కె.రాజమల్లు, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, సీనియర్ పీవో మల్లేష్, సతీష్, సిబ్బంది పాల్గొన్నారు.


వస్త్రాలు పరిశీలిస్తున్న జీఎం ఎం.శ్రీనివాస్

గోలేటిలో స్వచ్ఛ పక్వాడా

గోలేటి టౌన్‌షిప్, న్యూస్‌టుడే: బెల్లంపల్లి ఏరియా గోలేటి జీఎం కార్యాలయం ఆవరణలో జీఎం శ్రీనివాస్ ఆధ్వర్యంలో బుధవారం ఉద్యోగులంతా ఉత్సాహంగా కలిసి స్వచ్ఛత పక్వాడా కార్యక్రమంలో పాల్గొన్నారు. జీఎంతో పాటు అధికారులు, సిబ్బంది గంట పాటు స్వచ్ఛత పనులు చేపట్టారు. గడ్డి మొక్కలు, ముళ్లపొదలు, చెత్తాచెదారాన్ని తొలగించారు. జీఎం కూడా సిబ్బందితో కలిసి పనుల్లో నిమగ్నమయ్యారు. జీఎం మాట్లాడుతూ.. స్వచ్ఛత కార్యక్రమాలు ఒక రోజుతో సరిపెట్టకుండా నిత్యం తమ పరిసరాలను పరిశుభ్రం చేసుకోవాలని సూచించారు. సమష్టి కృషితోనే ఏరియాను అన్ని రంగాల్లో ముందుండేలా ఉత్సాహం చూపాలని పేర్కొన్నారు. ఏరియా సర్వే అధికారి చంద్రశేఖర్, డీజీఎం(ఐఈడీ) ఉజ్వల్‌కుమార్ బెహరా, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, సివిల్ ఎస్ఈ ఎస్కే మదీనా భాషా, ఫైనాన్స్ మేనేజర్ రవికుమార్, ఎన్విరాన్‌మెంట్ అధికారి రమేశ్, ఐటీ ఇన్‌ఛార్జి ముజీబ్ పాల్గొన్నారు.

విద్యుత్తు అధికారుల పొలం బాట

కాగజ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: వ్యవసాయ కనెక్షన్లకు ఎక్కడైనా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటే రైతులు తమకు సమాచారం అందించాలని వెంటనే పరిష్కరిస్తామని కాగజ్‌నగర్ గ్రామీణ ట్రాన్స్‌కో ఏఈ రాంప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని కోసినిలో విద్యుత్తు శాఖ ఆధ్వర్యంలో పొలంబాట కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. బోరుబావుల కింద సాగు చేసిన వరి పొట్ట, కంకిదశలో ఉందని, నీటి తడుల అవసరం ఉంటున్నందున, కరెంటు సరఫరాలో అంతరాయం ఉంటే సిబ్బందికి సమాచారం అందించాలని సూచించారు. వెంటనే పరిష్కరిస్తామని చెప్పారు. తమ సిబ్బంది రేయింబవళ్లు అందుబాటులో ఉంచుతామని చెప్పారు. వ్యవసాయ కనెక్షన్లకు కేపాసిటర్లు బిగించుకోవాలని సూచించారు. లైన్ ఇన్‌స్పెక్టర్లు విలాస్, ఎమ్మాజీ సతీష్‌కుమార్, రమేష్, లైన్‌మెన్ సత్తయ్య, సహాయ లైన్‌మెన్ శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.


గంగాపూర్ గ్రామ రైతులకు అవగాహన కల్పిస్తున్న విద్యుత్తు సిబ్బంది


కోసిని పొలం బాట కార్యక్రమంలో ట్రాన్స్‌కో ఏఈ రాంబాబు, ఉద్యోగులు

చింతలమానెపల్లి: మండలంలోని గంగాపూర్ గ్రామ సమీప పొలాల్లో పొలం బాట కార్యక్రమం ద్వారా విద్యుత్తు వినియోగంపై రైతులకు బుధవారం ఆ శాఖ సిబ్బంది అవగాహన కల్పించారు. ప్రతి రైతు నాణ్యమైన విద్యుత్ మోటార్లతోపాటు కెపాసిటర్లను వినియోగించాలని సూచించారు. చేన్లలో విద్యుత్తు తీగలు వేలాడినా, ప్రమాదకరంగా ఉన్న సిబ్బందికి సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈ ప్రేమ్‌కుమార్, ఫోర్‌మెన్ నర్సింగరావు, లైన్‌ఇన్‌స్పెక్టర్లు మాదవ్, ప్రవీణ్, సిబ్బంది లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు టీకాల పంపిణీ

వాంకిడి, న్యూస్‌టుడే: గర్భిణులు ఆరోగ్యంగా పరంగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆరోగ్యవిస్తరణాధికారి రవిదాస్ అన్నారు. బుధవారం ఖిరిడి ఆరోగ్య ఉపకేంద్రంలో గర్భిణులకు నిర్వహిస్తున్న టీకాల పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించారు. నిర్దేశించిన ప్రకారం గర్భిణులు, చిన్నారులు టీకాలు వేయించుకోవాలని సూచించారు. పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలను తీసుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని అవగాహన కల్పించారు. ఏఎన్ఎం కృష్ణకుమారి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

28న ఉమ్మడి జిల్లా సదస్సు జయప్రదానికి కృషి

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఈ నెల 28న ఉమ్మడి జిల్లా సదస్సు జయప్రదం చేసేలా అన్ని చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారీ పేర్కొన్నారు. బుధవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర వెనుకబడిన తరగతుల కమిషన్ ఛైర్మన్ నిరంజన్‌గౌడ్.. కమిటీ సభ్యులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు బీసీ సంక్షేమ శాఖ, ఇతర శాఖల అధికారులతో కలిసి జూమ్ మీటింగ్ నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్ల, ఆర్డీవో లోకేశ్వర్‌రావు, జడ్పీ సీఈవో లక్ష్మీనారాయణ, డీపీవో భిక్షపతిగౌడ్, జిల్లా బీసీ అభివృద్ధి అధికారి సజీవన్‌లతో కలిసి అదనపు కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. జిల్లాలోని అన్ని కులాల ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు, శాసన మండలి, శాసనసభ సభ్యులు, స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు, అధికారులు సదస్సుకు హాజరయ్యేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.


వీడియో కాన్ఫరెన్సులో పాల్గొన్న అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, చిత్రంలో అదనపు కలెక్టర్(రెవెన్యూ) దాసరి వేణు, ఆర్డీవో లోకేశ్వర్‌రావు, బీసీ అభివృద్ధి అధికారి సజీవన్, జడ్పీ సీఈవో లక్ష్మీనారాయణ, డీపీవో భిక్షపతి

కర్ర లారీల అడ్డగింత

కాగజ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: సిర్పూర్ పేపర్ మిల్లుకు స్థానిక లారీ అసోసియేషన్ మధ్య వివాదం ఇంకా కొనసాగుతోంది. బుధవారం ఎస్పీఎంకు కర్ర లోడ్‌తో వచ్చే లారీలను పట్టణంలోకి రానివ్వకుండా లారీ అసోసియేషన్ సభ్యులు అడ్డుకున్నారు. ఒకదశలో లారీ అసోసియేషన్ అధ్యక్షుడు కిశోర్‌బాబు లారీ కింద పడుకుని నిరసన తెలిపారు. అక్కడే ఉన్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని అసోసియేషన్ సభ్యులను సముదాయించారు. ఈ విషయంలో కాగజ్‌నగర్ గ్రామీణ పోలీసులు చెబుతున్న వాదన ఇందుకు భిన్నంగా ఉంది. ప్రమాదకరంగా అధిక కర్ర లోడ్‌తో మిల్లుకు వస్తున్న పది లారీలకు రూ.20 వేల జరిమానా విధించామని రూరల్ ఎస్సై మహేందర్ చెప్పడం గమనార్హం. లారీలను అడ్డుకున్న విషయంలో తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని ఎస్సై పేర్కొన్నారు.


వాహనం కింద పడుకున్న లారీ అసోసియేషన్ అధ్యక్షుడు కిశోర్‌బాబు

నియంత్రిక వచ్చే..

ఈనాడు స్పందనకు వందనం

దహెగాం, న్యూస్‌టుడే : 'విద్యుత్తు లేక.. నీటికోసం పాట్లు' శీర్షికన ఈనాడులో ప్రచురితమైన కథనానికి స్పందన లభించింది. మండలంలోని కుంచవెల్లి గ్రామంలో రైతు రౌతు రాజన్నకు చెందిన 25 ఎకరాలలో సాగు చేసిన పంటలు నీరు లేక ఎండిపోతున్నాయి. నియంత్రిక చెడిపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో స్పందించిన అధికారులు నూతన నియంత్రికను తెప్పించారు.

పాఠశాలల తనిఖీ

పెంచికల్‌పేట్: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు చదువుల్లో రాణించి మెరుగైన ఫలితాలు సాధించాలని మండల ప్రత్యేక అధికారి ప్రభాకర్ అన్నారు. బుధవారం లోడ్పల్లిలోని కొత్తగూడ ట్రైబల్ వెల్ఫేర్, కొండపల్లి, జైహింద్‌పూర్ గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేసి విద్యార్థులను సామర్థ్యాలు తెలుసుకున్నారు. కొత్తవాడలో మినీ అంగన్‌వాడీ కేంద్రం కావాలని, ప్రాథమిక పాఠశాలలో తాగునీటి సౌకర్యం కల్పించాలని గ్రామస్థులు కోరారు. కొండపల్లి ప్రాథమిక పాఠశాలలో మరుగుదొడ్లు నిర్మించాలని, తాగునీటి మోటార్‌కు మరమ్మతులు చేయాలని ఉపాధ్యాయులు కోరారు. గొల్లవాడకు వెళ్లే మార్గంలో వాగుపై వంతెన నిర్మించాలని జైహింద్‌పూర్ నుంచి కొండపల్లి వరకు రోడ్డు సౌకర్యం కల్పించాలని గ్రామస్థులు కోరారు.

నూతన బాధ్యతల స్వీకరణ

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే: ప్రజా రక్షణకు అన్ని విధాలా కృషి చేస్తామని సీఐ బుద్దె రవీందర్ అన్నారు. బుధవారం ఆయన ఆసిఫాబాద్ సీఐగా బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ సీఐగా పని చేసిన సతీష్ బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఇంటలీజెన్స్‌లో సీఐగా పని చేస్తున్న రవీందర్ ఆసిఫాబాద్‌కు బదిలీపై వచ్చారు. ఎస్పీ డి.వి.శ్రీనివాసరావును మర్యాద పూర్వకంగా కలిశారు.

మరుగుదొడ్ల మంజూరుకు దరఖాస్తుల ఆహ్వానం

వాంకిడి, న్యూస్‌టుడే: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో మరుగుదొడ్ల మంజూరు కోసం దరఖాస్తు చేసుకోవాలని ఉపాధిహామీ ఏపీవో శ్రావణ్‌కుమార్ తెలిపారు. https:///sbm.gov.in/sbm_dbt/secureogin.aspx దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గతంలో మంజూరు కాని వారు కూడా దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని చెప్పారు. అంతర్జాలంలో నమోదు చేసిన దరఖాస్తు ఫారంతో ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతాపుస్తకం, జాబ్‌కార్డు నఖలు ప్రతులను జతపరిచి సంబంధిత పంచాయతీ కార్యదర్శి లేదా మండల పరిషత్ కార్యాలయంలో అందజేయాలని వివరించారు.

అష్టలక్ష్మి ఆలయంలో పూజలు

ఆర్కేపురం, న్యూస్‌టుడే: హైదరాబాద్ నగరంలోని ఆర్కేపురం డివిజన్‌కు చెందిన అష్టలక్ష్మి ఆలయంలో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్.. బుధవారం ఎమ్మెల్యే హరీశ్‌బాబుతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు రాధారెడ్డి, నర్సింహగుప్తా, పవన్, ఆలయ ఫౌండర్ ఛైర్మన్ గౌరిశెట్టి చంద్రశేఖర్‌గుప్తా, ఛైర్మన్ సోమ సురేష్, తదితరులు పాల్గొన్నారు.

28న ఐక్యత సదస్సు

ఆసిఫాబాద్ అర్బన్, న్యూస్‌టుడే : రంగారెడ్డి జిల్లా తుర్కయాంజల్ సాయిబాబా ఆలయ ఆవరణలో ఈ నెల 28వ తేదీన నిర్వహించే అన్ని జిల్లాల అర్చక సంఘాల ఐక్యత సదస్సును విజయవంతం చేయాలని ధూప దీప నైవేద్య అర్చక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు గంగు సత్యనారాయణ, జిల్లా అధ్యక్షులు వఝుల శిరీష్‌శర్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంఘ రాష్ట్ర అధ్యక్షుడు వాసుదేవ శర్మ అధ్యక్షతన జరిగే సదస్సులో అర్చకుల సంక్షేమం, సమస్యలపై చర్చించి భవిష్యత్తు కార్యాచరణ రూపొందించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని సంఘ బాధ్యులు విధిగా హాజరు కావాలని కోరారు.

పరిహారం మంజూరుకు వినతి

ఆసిఫాబాద్: అడవి పంది దాడిలో గాయపడి చికిత్స పొందుతున్న మల్టీపర్పస్ వర్కర్ లింగయ్యకు నష్టపరిహారం మంజూరు చేసి ఆదుకోవాలని ఆయన కుమారుడు చంద్రశేఖర్ కోరుతున్నాడు. ఈ నెల 18న విధుల్లో భాగంగా గ్రామంలో పాఠశాల, రైతు వేదికల వద్ద బ్లీచింగ్ పౌడర్ చల్లారన్నారు. అక్కడి నుంచి చేను బాటలో ఎస్సీ కాలనీకి వెళుతుండగా.. అడవి పంది దాడి చేసినట్లు చెప్పారు. కాళ్లు, చేతులపై గాయపర్చడంతో ఆసిఫాబాద్, అక్కడి నుంచి మంచిర్యాల ఆసుపత్రికి తరలించినట్లు చెప్పారు. ప్రస్తుతం చికిత్స పొందుతున్నట్లు పేర్కొన్నారు. అటవీ అధికారులు స్పందించి పరిహారం మంజూరు చేయాలని వినతి పత్రం ఇచ్చినట్లు తెలిపారు.


ప్రభుత్వ భూముల ఆక్రమణలపై విచారణ

పెంచికల్‌పేట్, న్యూస్‌టుడే: మండలంలోని ఎల్కపల్లి, ఎల్లూర్ గ్రామాల్లో సర్వే నం.61లో ప్రభుత్వ భూములను ఆక్రమించారని పలువురు ఫిర్యాదు చేశారు. ఈమేరకు బుధవారం పెంచికల్‌పేట్ తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావు ఆధ్వర్యంలో ఇరిగేషన్ డీఈ భద్రయ్యతో కలిసి ప్రభుత్వ భూముల్లో సర్వే చేపట్టారు. ఎల్కపల్లి గ్రామంలోని సర్వే నం.61, బొక్కివాగు ప్రాజెక్టు శిఖం భూములకు హద్దులను గుర్తించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సర్వేలు నిర్వహించామని, నివేదిక అధికారులకు అందిస్తామని వారు పేర్కొన్నారు.

వయోధికుల సమస్యలపై సమావేశం

కాగజ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: తెలంగాణ సీనియర్ సిటిజన్ల రాష్ట్ర స్థాయి జూమ్ సమావేశాన్ని హైదరాబాద్‌లో బుధవారం రాష్ట్ర అధ్యక్షుడు పి.నర్సింహరావు అధ్యక్షతన నిర్వహించారు. కుమురంభీం జిల్లా కాగజ్‌నగర్‌కు చెందిన సీనియర్ సిటిజన్ల సంఘం రాష్ట్ర కార్యదర్శి మార్త సత్యనారాయణ, ప్రతినిధులు కలికోట రమణయ్య, మూర్తి, చిలుక లక్ష్మీనారాయణ, ఆకుల నాగేశ్వర్‌రావులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వయోధికులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించినట్లు రాష్ట్ర కార్యదర్శి చెప్పారు. ప్రధానంగా వయోధికులపై జరుగుతున్న వేధింపుల నివారణకు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు తీర్మానించినట్లు పేర్కొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్తు స్తంభం


రవీంద్రనగర్ గ్రామ సమీపంలో ..

మండలంలోని రవీంద్రనగర్-1 గ్రామ సమీపంలో గంగాపూర్ గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారికి ఆనుకొని విద్యుత్తు స్తంభం ఒకవైపుకు వంగి చెట్టుపై వాలి ప్రమాదకరంగా మారింది. కోర్సిని ఎత్తిపోతల పథకానికి వెళ్లే ప్రధాన విద్యుత్తు లైన్ ఇది. ఈ స్తంభం మాత్రమే కాకుండా దానికి ఇరు వైపులా ఉన్న మరో మూడు నాలుగు స్తంభాలు కూడా వంగి ప్రమాదకరంగా ఉన్నాయి. ఇవన్నీ శ్రీనికేతన్ ప్రైవేటు పాఠశాల సమీపంలోనే ఉండటంతో అటు వైపు వెళ్లే విద్యార్థులు, చుట్టు పక్కల పంట పొలాల రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎలాంటి ప్రమాదం జరగక ముందే స్తంభాన్ని సరిచేయాలని సంబంధిత అధికారులను కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, చింతలమానెపల్లి**


పాల్గొన్న భక్తులు

ధ్యానంతో మానసిక ప్రశాంతత

వాంకిడి, న్యూస్‌టుడే: నిత్యం ధ్యానం చేయడం ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని పులాజీబాబా కుమారుడు కేశవరావు ఇంగ్లే అన్నారు. బుధవారం గోయగాం ధ్యానకేంద్ర వార్షికోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. చెడు వ్యసనాలను వీడి ఆధ్యాత్మిక అలవర్చుకోవాలని సూచించారు. ముందుగా ధ్వజారోహణం, భక్తి ప్రవచనాలు, అన్నదాన వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. సిద్దేశ్వర పులాజీబాబా సంస్థాన్ సభ్యులు భగవంత్‌రావు, నాగోసె శంకర్, మండల మాలీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వాడై బాబురావు, ధ్యాన కేంద్రం అధ్యక్షుడు దుర్వ ముకుంద్‌రావు, సభ్యులు బాపూజీ, భక్తులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పులాజీబాబా కుమారుడు కేశవరావు ఇంగ్లే

భూదాతకు సన్మానం

వాంకిడి, న్యూస్‌టుడే: మండలంలోని చౌపన్‌గూడ గ్రామ పంచాయతీ పరిధిలోని సడక్‌గూడ గ్రామానికి పీఎం జన్‌మన్ పథకంలో భాగంగా మల్టీపర్పస్ కేంద్ర భవనం నిర్మాణానికి నిధులు రూ.60 లక్షలు మంజూరయ్యాయి. భవన నిర్మాణానికి ప్రభుత్వ స్థలం లేకపోవడంతో రాథోడ్ గులాబ్ అయిదు గుంటల భూమిని వితరణ రూపేణా ఇచ్చేందుకు ముందుకొచ్చారు. గ్రామస్థులు బుధవారం ఆయనను శాలువాతో సన్మానించారు. గ్రామ పటేల్ ఆత్రం గుండయ్య, మాజీ సర్పంచి సిడాం అన్నిగ, సిడాం భీము, భగవంత్‌రావు, సిడాం మారు, భీము, రాథోడ్ ప్రభు తదితరులు పాల్గొన్నారు.

గంగా మాత విగ్రహ ప్రతిష్ఠాపన

బెజ్జూర్, న్యూస్‌టుడే: మండల కేంద్రంలో మత్స్యకార సంఘం ఆధ్వర్యంలో బుధవారం గంగా మాత విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. బాజాభజంత్రీలు, మంగళహారతులతో విగ్రహంతో ఊరేగించి అనంతరం ప్రతిష్ఠాపన చేసి ప్రత్యేక పూజలు చేశారు. అయిదు రోజుల పాటు భక్తిశ్రద్ధలతో పూజలు చేయనున్నారు. మత్స్యకార సంఘం అధ్యక్షుడు సూర్ల ఇస్తారి, ఉపాధ్యక్షుడు బుచ్చయ్య, కుల పెద్దలు బాలయ్య, పోషయ్య, తదితరులు పాల్గొన్నారు.

పోలీసు అమర వీరులకు ఘన నివాళి

కాగజ్‌నగర్, న్యూస్‌టుడే : పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో బుధవారం పోలీసు అమరవీరుల చిత్రపటానికి సంఘం ఆధ్వర్యంలో ఘన నివాళి అర్పించారు. అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అధ్యక్షుడు జయదేవ అబ్రహం మాట్లాడుతూ.. సమాజంలో శాంతిభద్రతల స్థాపనకు అలుపెరగని పోరాటం చేస్తున్న పోలీసుల సేవలు మరువలేనివన్నారు. పోలీసుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. సంఘం కార్యదర్శి శివప్రసాద్ నాయర్, దుర్గం విస్తారు, బావండ్లపల్లి నర్సయ్య, సుభాష్, మార్త సత్యనారాయణ, ఏఎస్ఆర్ మూర్తి తదితరులున్నారు.


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఏఎస్సై రమేష్


పోలీసు అమరుల స్థూప చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు

దహెగాంలో ఓపెన్ హౌస్

దహెగాం: మండలంలోని కళాశాల విద్యార్థులకు పోలీస్‌స్టేషన్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు ఓపెన్ హౌస్ నిర్వహించారు. ఠాణాలో పోలీసుల విధులు, అందిస్తున్న సేవల గురించి వివరించారు. ఏఎస్సై రమేష్, పోలీసులు పాల్గొన్నారు.


కౌటాలలో..


బెజ్జూరులో భీం విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

కుమురంభీం వర్ధంతి

బెజ్జూరు, న్యూస్‌టుడే : మండల కేంద్రంలోని ఆదివాసీల ఆధ్వర్యంలో పోరాట యోధుడు కుమురంభీం వర్ధంతి వారోత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా బాజభజంత్రీల మధ్య లక్ష్మీదేవరతో ఆదివాసీ భవనం నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ చేపట్టిన ఆదివాసీలు.. భీం విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు చేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పీపీసీఎస్ ఛైర్మన్ ఓంప్రకాశ్, ఏటీడీఓ ఖమర్‌హుస్సేన్, ఆదివాసీ గోండువాన కోయ సంఘం జిల్లా అధ్యక్షుడు సోయం చిన్నయ్య, ఆదివాసీ జేఏసీ మండల అధ్యక్షుడు సకారాం, ప్రధాన కార్యదర్శి తిరుపతి, సర్‌మేడీ శంకర్, తదితరులు పాల్గొన్నారు.

కౌటాల: మండల కేంద్రంలో బుధవారం కుమురంభీం వర్ధంతి వేడుకలను నిర్వహించారు. భీం అడుగుజాడల్లో నడవాలని డీసీఎంఎస్ వైస్‌ఛైర్మన్ కుమురం మాంతయ్య అన్నారు. మన్నె వార్ కోలావార్ జిల్లా అధ్యక్షుడు డబ్బా బాపు, నాయకులు కుర్మరాజు, సిద్దయ్య, సత్తయ్య, పోచాని తదితరులు పాల్గొన్నారు.

సిర్పూర్(టి): మండలంలోని చీలపల్లి గ్రామంలో బుధవారం ఆదివాసీ కోలవార్ సంఘం ఆధ్వర్యంలో భీం వర్ధంతిని నిర్వహించారు. నాయకులు సుర్పం అర్జు, సుర్పం మారు, గెడం నగేష్, నాయిని సత్తెన్న, అధ్యక్షుడు గంట గోపాల్ తదితరులున్నారు.